క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



ఈవోకు విరాళ చెక్కును అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పుట్టా ఫణికుమార్, శ్రీలక్ష్మి దంపతులు రూ.1,08,000ను శనివారం ఆలయ ఈవో వై.భద్రాజీకి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కనకరాజు, అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ కిరీటానికి విరాళం



బంగారాన్ని అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి చేయించబోయే బంగారు కిరీటం కోసం పలువురు దాతలు ముందుకొస్తున్నారు. సూర్యకుమారి ఒక గ్రాము బంగారం, శ్రీనివాస్, మంగకుమారి దంపతులు 2 గ్రాముల బంగారం విరాళంగా అందించారని అర్చకులు గోపాలాచార్యులు శనివారం తెలిపారు.

ఎంపీపీకి పరామర్శ



వెంకటరమణను పరామర్శిస్తున్న నాయకులు

జి.సిగడాం: జి.సిగడాం ఎంపీపీ మీసాల వెంకటరమణ తల్లి ఆదిలక్ష్మి ఇటీవల చెందడంతో ఆయన కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, బాలి అప్పలసూరి తదితరులు శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాలి రమేష్, భూపతి సురేష్‌కుమార్, మామిడి శ్రీనివాసరావు, టంకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


16 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



వ్యవసాయ క్షేత్రం వద్ద అధికారులు

గార: మండలంలో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ ఏడీ బగ్గు రజని తెలిపారు. శనివారం శాలిహుండంలో పొలంబడి చివరి వారంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించి పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మిల్లర్‌ను రైతు ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. కళ్లాల వద్దే శాంపిల్ తీసుకోవడం, రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. త్వరలోనే షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. తేమ, రవాణా, తాలు గింజలు, ధరలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏవో డి.పద్మావతి, గుండ భాస్కరరావు, సర్పంచ్ కె.ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ భవనానికి స్థల పరిశీలన



సంత తోటను పరిశీలిస్తున్న అధికారులు

గార: మండల కేంద్రం గారలో పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణానికి అనువైన స్థలాలను శనివారం పరిశీలించారు. వంశధార నదిపై బ్రిడ్జి రోడ్డులో ప్రస్తుత భవనం ఉండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. తహశీల్దార్ సనపల రమణారావు, ఎస్‌ఐ ఆర్.జనార్దనలు సంతతోట స్థలం, ప్రస్తుత స్టేషన్ పక్కన స్థలం, పాత తహశీల్దార్ కార్యాలయాల స్థలాన్ని గుర్తించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ డి.సంజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పూడి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పూడి కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్‌భవన్‌లో కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఏపీ ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావుల సమక్షంలో నియామక పత్రం అందుకున్నారు.

ఇదేం తీరు?

- రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాల నిర్వహణలో అధికారులు విఫలం
- కనీస సౌకర్యాలు కల్పించని అధికారులు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



శ్రీకాకుళం ప్రభుత్వ బాలురు పాఠశాలలో వేదిక

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా, విద్య, సాంస్కృతిక పోటీలను జిల్లా స్థాయిలో నిర్వహించటంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలను నిర్వహించాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం నిధులను మాత్రం కేటాయించలేదు. అందుబాటులో ఉన్న నిధులను వినియోగించి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. నిర్వహణ బాధ్యతను విద్యాశాఖకు అప్పగించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఈనెల 20న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శనివారం జిల్లా స్థాయిలో శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. టెక్కలి, శ్రీకాకుళం ఉప విద్యాశాఖ అధికారులు సెలవులో ఉండటంతో ఇన్‌చార్జిలుగా ఉన్న వారు కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా వారు అంతంత మాత్రంగానే దృష్టి సారించారు. విద్యార్థులకు కనీసం తాగునీటిని కూడా కల్పించలేదు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 120 మంది వరకు విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా పాఠశాలల్లో నిధులు లేనందున కనీసం 50 శాతం మంది కూడా పోటీలకు హాజరు కాలేదు. హాజరైన విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించకపోవటంతో విద్యార్థులు ఆకలితో అలమటించారు. చివరకు విలేకరులు వస్తున్నారని తెలిసి సర్వశిక్ష అభియాన్, పీఎంఒ, ఎంఈఓలు అక్షయపాత్ర ప్రతినిధులతో మాట్లాడి విద్యార్థులకు భోజనాలు తెప్పించే ఏర్పాట్లు చేశారు. అయితే పోటీల నిర్వహణకు, సభ నిర్వహించేందుకు కూడా అధికారులు అంతగా ఆసక్తి చూపకపోవటంతో తూతూమంత్రంగానే ముగించేశారు. దీంతో రాజ్యాంగా పేరు చెప్పి నిర్వహించిన కార్యక్రమం అభాసుపాలైనట్లయ్యింది.

అందరికీ ఆహ్వానించాం..

రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమం సర్వ శిక్షాభియాన్ ఆధ్వర్యంలో జరిగింది. ఏర్పాట్లన్నీ వారే చేశారు. అందరికీ ఆహ్వానం పంపించాం. సౌకర్యాలు కూడా కల్పించాం.

– అలీఖాన్, ఇన్‌చార్జి ఉప విద్యాశాఖాధికారి

వర్సిటీలో విజ్ఞానయాత్ర



ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని బెజ్జిపురం యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఇండియా లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం సందర్శించారు. రెడీనెస్, బాలవికాస్ కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియట్, హైస్కూల్ విద్యార్థులు తరగతి గదులు, వసతి గృహం, ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్, ఎన్టీఆర్ నైపుణ్య శిక్షణ కేంద్రం, పీహెచ్‌సీలను పరిశీలించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

నిరుపయోగంగా మరుగుదొడ్లు



ఎచ్చెర్ల భవిత కేంద్రంలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. తలుపులు పాడైపోవడంతో వినియోగంలో లేక అధ్వానంగా తయారయ్యాయి. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం భవిత కేంద్రానికి అనుసంధానంగా ఈ మరుగుదొడ్లు నిర్మించారు. నిర్వహణ లేక మూలకు చేరాయి.

– ఎచ్చెర్ల క్యాంపస్

మోదీ పర్యటన అడ్డుకుంటాం



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: 'విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకపోతే ప్రధాని మోదీ పర్యటన అడ్డుకుంటామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు అన్నారు. శ్రీకాకుళం ఇందిరావిజ్ఞానభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 29న ప్రధాని మోదీ విశాఖ వస్తున్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రవేటుపరం చేయబోమని స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అరసవల్లి కూడలి వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గాదం వెంకట త్రినాథరావు, రెల్ల సురేష్, వెంకన్ననాయుడు, మజ్జి త్రినాథరావు, వెంకటరమణ, మధుసూదన్‌రావు, వెంకట్ నాయుడు, ఈశ్వరి, మామిడి సత్యనారాయణ, అప్పారావు, సాయి రాజేష్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: మహారాష్ట్ర అసెంబ్లీల్లో ఎన్నికల్లో బీజేపీ కూటమి అఖండ మెజారిటీ సాధించడంతో ఆ పార్టీ నాయకులు శనివారం శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద సంబరాలు జరుపుకొన్నారు. మిఠాయిలు పంచిపెట్టి, బాణసంచా కల్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాల్, అట్టాడ రవిబాబ్జి, పైడి సాంబమూర్తి, శవ్వాన ఉమామహేశ్వరి, శవ్వాన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

జి.సిగడాం: ధాన్యం కొనుగోలులో అలసత్వం వహించవద్దని ఆర్‌డీఓ సాయి ప్రత్యూష అన్నారు. శనివారం పెంట గ్రామంలో ధాన్యాన్ని పరిశీలించారు. ఆమెతోపాటు డివిజనల్ సర్వే అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఏఓ యర్రా శారద, వీఆర్‌ఓ నర్సింగరావు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం



ఎంపీపీ చిరంజీవి, సభ్యుల మధ్య వాగ్వాదం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ సాధారణ సమావేశం పోలీసుల పటిష్ట భద్రత నడుమ శనివారం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఆయన వ్యతిరేకవర్గం హాజరుకావడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జీఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎచ్చెర్ల, లావేరు ఎస్సైలు వి.సందీప్‌కుమార్, లక్ష్మణరావులు ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జూన్ 19న ప్రతిపాదనలు పెట్టి సెప్టెంబర్ 11న సభ ఆమోదం తెలిపిన రూ. 98 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులు, మండల పరిషత్ సాధారణ నిధుల పనులకు సంబంధించి పరిపాలన ఆమోదం తెలపడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. కుప్పిలి ఎంపీటీసీ బల్లాడ జనార్దనరెడ్డి, కొంగరాం ఎంపీటీసీ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జరగుళ్ల విజయకుమారి, జరజాం ఎంపీటీసీ సభ్యులు సీరపు శ్రీరామ్మూర్తి, బొంతలకోడూరు ఎంపీటీసీ మాడుగుల జగదీశ్వరరావు మాట్లాడుతూ అజెండాలో పెట్టకుండా, సభ్యులకు సమాచారం లేకుండా, సభ్యులు ఓటింగ్ లేకుండా ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ ముందుగా అజెండా మేరకు సభ సాగాలని, చివర్లో సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తామని చెప్పారు. ముందు తమకు సమాధానం చెప్పాలని సభ్యులు పట్టుబట్టగా.. నలుగురినీ నాలుగు నెలల పాటు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నానని, 12 గంటలకు సభ వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. వెంటనే వీరిని సభ నుంచి బయటకు పంపాలని ఎంపీడీవో సీపాన హరిహరరావుకు సూచించారు. సభ నుంచి తాము బయటకు వెళ్లేది లేదని సదరు సభ్యులు తేల్చి చెప్పారు. పోలీసులు సైతం ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని, శాంతిభద్రతలు కాపాడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. చివరికి నాలుగు గంటలకు సభ ప్రారంభించి వెనువెంటనే సభ ముగిసిందని ఎంపీపీ ప్రకటించారు. దీంతో సభ్యులంతా వెళ్లిపోయారు.

'వర్తమాన భారత్ దృక్చిత్రం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని న్యూకాలనీ సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి పత్తి సుమతి రచించిన 'వర్తమాన భారత్ దృక్చిత్రం' పుస్తకాన్ని శనివారం మందిర ప్రతినిధి భరద్వాజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత్రి మాట్లాడుతూ పుస్తకాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి మందిరం ప్రతినిధులు కింతలి శ్రీనివాస్, జయరాం గుప్త తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరు పంచాయతీ పాత దిబ్బలపాలెం సమీపంలో శనివారం రాత్రి పేకాట శిబిరంపై ఎస్‌ఐ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.74 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారంతా శ్రీకాకుళం నగరానికి చెందిన వారని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: మందస మండలం హరిపురం వేదికగా ఆది, సోమవారాల్లో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తిలతో కలిసి శనివారం జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో తరగతుల విలీనాన్ని రద్దుచేసి, ప్రాథమిక పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నవంబర్ 24 25 తేదీల్లో జరిగే మహాసభల్లో విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలను చర్చిస్తామని మొదటిరోజు భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మానవహారం నిర్వహిస్తున్న మహిళా, విద్యార్థి సంఘాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశాఖ 'లా' విద్యార్థికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శ్రీకాకుళం నగరంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. సూర్య మహల్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి హరీష్, ఐద్వా జిల్లా కన్వీనర్ ఏ.లక్ష్మి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు సీహెచ్ రాజు మాట్లాడుతూ బాధితులకి న్యాయం చేయడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు లలిత, లత తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షిద్దాం



షణ్ముఖశర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: సనాతన ధర్మం అనేది ఒక వృక్షం లాంటిదని రుషిపీఠం వ్యవస్థాపకులు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఉపనిషన్మందిరం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో 'శ్రీసూర్య దర్శనం'పై ఐదు రోజుల ప్రవచన యజ్ఞం శనివారం ప్రారంభమైంది. ఈ సంర్భంగా ఆయన మాట్లాడతూ సూర్యదర్శనంతో మంత్ర జపం చేస్తే ఫలితముంటుందన్నారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, సుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, నిష్టల నర్సింహమూర్తి, పులఖండం శ్రీనివాసరావు, గుత్తు చిన్నారావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, తెన్నేటి విక్రమ శర్మ, మండవిల్లి రవి, కొంక్యాన మురళీధర్, కామేశ్వరరావు, బాబూరావు, సనపల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వం సాయిమయం



శ్రీకాకుళం కల్చరల్:హయాతినగరలో సత్యసాయి జయంతి వేడుకలు



శ్రీకాకుళం కల్చరల్: హడ్కోకాలనిలో నృత్య ప్రదర్శన



శ్రీకాకుళం కల్చరల్: పెద్దమందిరంలో కేక్ కట్‌చేస్తున్న గొండు స్వాతి



శ్రీకాకుళం కల్చరల్:న్యూకాలనీలో పల్లకీ ఉత్సవం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాలకొండ రోడ్డులోని పెద్దమందిరంలో ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి కేక్ కట్ చేశారు. కన్వీనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. మహిళలు భజన పాటలు పాడుతూ సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో వరం చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీలు అంధవరపు ప్రసాద్, సంతోష్, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, జి.రమణబాబు, సత్యసాయి సేవకులు పాల్గొన్నారు. న్యూకాలనీ సత్యసాయి మందిరంలో కన్వీనర్ జయరాం గుప్తా ఆధ్వర్యంలో 21కేజీల కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో డీవీఎస్ భరద్వాజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పీఎన్‌కాలనీలోని భజన మండలి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి అన్నదానం నిర్వహించారు. పాత శ్రీకాకుళంలోని సత్యం, శివం, సుందరం మందిరంలో కన్వీనర్ వల్లభ ఆధ్వర్యంలో తిరువీధి ఉత్సవం ఘనంగా సాగింది. అరసవల్లిలోని శాంతి క్షేత్రంలో మందిరం కన్వీనర్ బీఎస్ ప్రసాదరావు ఆధ్వర్యంలో స్వామికి పూజలు చేసి కేక్ కట్ చేశారు. రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. హయాతీనగరం సత్యసాయి భజనమండలి సభ్యులు ఫల్గుణరావు ఆధ్వర్యంలో నగర సంకీర్తన, కేక్ సమర్పణ చేశారు. రిమ్స్ అన్నపూర్ణ నిత్యాన్నదానం వద్ద సత్యసాయి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పథకం అధ్యక్షుడు గంగుల రమణబాబు కేక్ కట్ చేశారు. బలగ హడ్కో కాలనీలోని సత్యసాయి మందిరంలో నాట్య ప్రదర్శన అలరించింది. న్యూకాలనీ సత్యసాయి మందిరంలో పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

జి.సిగడాం: సత్యసాయిబాబా జయంతి సందర్భంగా శనివారం జి.సిగడాంలో సుమారు ఐదు వేల మందికి అన్నదానం నిర్వహించారు.

గార: మండలంలోని బోరవానిపేట, కొర్ని, గోరువానిపేట గ్రామాల్లో అన్నసమారాధన నిర్వహించారు. గోరువానిపేటలో లక్ష్మణమూర్తి సత్యసాయి దివ్యసందేశాన్ని వినిపించారు. సాయంత్రం ఊరేగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కోయడ్యాన్స్ అలరించింది.

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలో సత్యసాయి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



జి.సిగడాంలో సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు



గార: గోరువానిపేటలో కుంకుమ పూజలు



గార: బోరవానిపేటలో సత్యసాయి జయంతి వేడుకలు



రణస్థలం: సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు



జి.సిగడాం: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సంక్షిప్తంగా...

స్టేషన్లను సందర్శించిన ఎస్పీ



శ్రీకాకుళం క్రైమ్/ఎచ్చెర్ల: నగరంలోని ట్రాఫిక్, మహిళా పోలీస్‌స్టేషన్లతో పాటు లావేరు పోలిస్ స్టేషన్‌ను ఎస్పీ మహేశ్వర రెడ్డి శనివారం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలందించారు.

భారత రాజ్యాంగం ఆదర్శనీయం

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం: ప్రపంచ దేశాల్లో కెల్లా భారతదేశ రాజ్యాంగం ఆదర్శప్రాయమైనదని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. ఈ నెల 26వ తేదీన జరగనున్న భారతరాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ–సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివిధ అంశాల్లో జిల్లాస్థాయి విద్యా, క్రీడా, సంస్కృతిక పోటీలు జరిగాయి. వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, పాటల పోటీలను సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ పరీక్షల విభాగం ఏసీ లియాకత్ అలీఖాన్, సమగ్రశిక్ష అధికారులు పేడాడ ప్రభాకరరావు, పూడి జనార్దనరావు, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగర పోలీసుల 'సంకల్పం'



శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో మండలవీధి, ఆదిత్య జూనియర్ కళాశాలల్లో ఒకటో, రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొన్నా పోలీసుల పూర్తి నిఘా ఉందని, పట్టుబడితే చర్యలు తప్పవని, విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదానం



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా రిమ్స్ హాస్పిటల్ రక్తదాన శిబిరం వారి ఆధ్వర్యంలో 20 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ హవల్దార్ రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లేపల్లిలో పారిశుద్ధ్య పనులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కళ్లేపల్లిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాలువల్లో పూడికలు తీయడంతో పాటు చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ పనులు పర్యవేక్షిస్తున్నారు.